క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారి తోటలో సంపత్ వినాయక దేవాలయం ఆవరణలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో వేసవి మొత్తం మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు కొండా రాంబాబు తెలిపారు.

స్వర్ణాకర్షణ భైరవుడికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాల త్రిపుర కాలభైరవ స్వామి పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ భైరవస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అరిణాంఅక్కివలసలో నేత్ర వైద్య శిబిరం



కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో అరిణాం అక్కివలసలో ప్రత్యేక సేవా శిబిరం కొనసాగుతోంది. శిబిరంలో భాగంగా ఆదివారం శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది గ్రామస్తులకు నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డి.తాతారావు, సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సేవా శిబిరం..

ఎచ్చెర్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్ జాతీయ సేవా ప్రత్యేక శిబిరం యూనిట్ – 7 ఆధ్వర్యంలో సేవా శిబిరం కొనసాగుతోంది. ఆదివారం సచివాలయ సంరక్షణ కార్యదర్శి పి.ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో మహిళల స్వీయ రక్షణ, దిశా యాప్‌పై అవగాహన కల్పించారు.

ఘనంగా అక్షయ తృతీయ పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, వెంకట సూర్యగణేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి హోమం చేశారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



తోటపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సెగిడి కార్పొరేషన్ డైరెక్టర్ కళ్లేపల్లి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వీరభద్రునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అర్చకులు బి.అశ్వనీకుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాల అభిషేకం, పుష్పార్చన, కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

‘స్పాట్’ పైకం పెంపు

- రెమ్యూనరేషన్ల పెంపుతో గురువులకు ఊరట
- 10 వేల మంది గురువులు, సిబ్బందికి లబ్ధి



పదో తరగతి జవాబుపత్రాలు దిద్దుతున్న టీచర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: గురువులకు ప్రభుత్వం ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న లెక్చరర్లు, ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్లను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో తాము చేసిన పనికి గాను గౌరవప్రదమైన భృతి లభిస్తుండటంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్లలో భాగస్వామ్యమైన జిల్లాలో 10వేల మంది లెక్చరర్లు/టీచర్లు, సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రెమ్యూనిరేషన్ల పెంపునకు గత ప్రభుత్వాలు నో చెప్పాయి. వారు చేసిన పనికిగాను మేలు చేసేందుకు ముందుకురాలేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ఉపాధ్యాయుల పక్షాన నిలిచింది. వారికి ఊరట కలిగించేలా ఇంటర్మీడియెట్‌కు 25 శాతం, పదో తరగతికి 20 శాతానికిపైగా రెమ్యూనరేషన్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

ఇదీ పరిస్థితి..

- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు 109 కేంద్రాల్లో జరిగాయి. 2వేల మంది పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యమయ్యారు.
- ఏప్రిల్ 1 నుంచి 18వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని 4 విడతలగా జరిగిన ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌కు 2.64 లక్షల జవాబుపత్రాలు వచ్చాయి. అన్ని విభాగాల పరిధిలో 1600 మంది భాగస్వామ్యం అయ్యారు.
- 30 మండలాల శ్రీకాకుళం జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు 149 కేంద్రాల్లో కొనసాగాయి. పరీక్షల్లో 3 వేల మంది ఉపాధ్యాయులు, 2 వేల సిబ్బంది భాగస్వామ్యం అయ్యారు.
- ఏప్రిల్ 19 నుంచి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాలగా కొనసాగుతున్న స్పాట్ వాల్యుయేషన్‌కు 2.20లక్షల జవాబుపత్రాలు వచ్చాయి. మూల్యాంకన ప్రక్రియలో 1600 మంది వరకు టీచర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పెరిగిన టెన్త్ రెమ్యూనిరేషన్లు ఇలా..

కేటగిరి	పాత రేట్లు రూ.లలో	పెంచిన కొత్త రేట్లు రూ.లలో
క్యాంప్ ఆఫీసర్	385	578
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్	330	495
అసిస్టెంట్ క్యాంఫ్ ఆఫీసర్	286	429
చీఫ్ కోడింగ్ ఆఫీసర్	220	330
అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్	198	297
చీఫ్ ఎగ్జామినర్	264	394
ఏఈ (అసిస్టెంట్ ఎగ్జామినర్..పేపర్‌కు)	6.60	10
స్పెషల్ అసిస్టెంట్	137.50	300
క్లరికల్ అసిస్టెంట్	88	132
ఆఫీస్ సబార్డినేట్స్	55	83

పెంపు ప్రకారం బిల్లులు..



ఇంటర్మీడియెట్ పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ల రెమ్యూనిరేషన్లు ప్రభుత్వం భారీగానే పెంచింది. పరీక్షలతోపాటు స్పాట్ కూడా ప్రశాంతంగా ముగిసింది. పెరిగిన రెమ్యూనిరేషన్ల ప్రకారమే బిల్లులు చెల్లింపులు చేస్తున్నాం. నేరుగా వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నాం.

– ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్ఐఓ శ్రీకాకుళం

పెంపు ఆనందకరం..



రెమ్యూనిరేషన్ల పెంపు ఏడేళ్లగా జరగలేదు. ఎట్టకేలకు పెంపు జరగడంతో ఉపాధ్యాయులకు కూడా ఊరట లభించినట్టయింది. పరీక్షలతోపాటు ముఖ్యంగా స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనిరేషన్ల పెంపు జరగడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెంచిన రేట్ల ప్రకారమే బిల్లులు చెల్లింపులు జరుపుతాం.

– గార పగడాలమ్మ, ఉప విద్యాశాఖాధికారి టెక్కలి

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



పత్తిపాడు ఎమ్మెల్యే ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు



ఆదిత్యుని జ్ఞాపికను స్వీకరిస్తున్న ఏపీ ప్రభుత్వ సలహాదారుడు చంద్రశేఖరరెడ్డి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తొలి వైశాఖ మాస ఆదివారం సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రముఖులు దర్శించుకున్నారు. కాకినాడ జిల్లా పత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఎమ్మెల్యే దంపతులు స్వామికి క్షీరాన్న భోగాన్ని సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సలహాదారుడు ఎస్.చంద్రశేఖరరెడ్డి కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఈయన వెంట ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం తదితరులున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొమ్మదేవర వెంకట సుబ్బారావు దంపతులు కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరికి కూడా ప్రత్యేక దర్శనాలు చేయించి, తీర్థప్రసాదాలు అందజేసారు.

ఒప్పంద కార్మికులకు పనిదినాలు కల్పించాలి



ఒప్పంద కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: యునైటెడ్ బ్రేవరీస్ ఒప్పంద కార్మికులందరికీ పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 24న చేపట్టనున్న చలో రణస్థలం తహసీల్దార్ కార్యాలయం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. బంటుపల్లి కూడలిలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములిచ్చిన స్థానికులైన ఒప్పంద కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు ఇవ్వకుండా అర్ధాంతరంగా నిలుపుదల చేసిందని, యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. డిమాండ్ ఉన్నప్పటికి ఆర్డర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని, లేని పక్షంలో చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదేశించినా యాజమాన్యం లెక్కచేయడం లేదన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, నాయకులు పి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, భద్రయ్య, చిన్న తదితరులు పాల్గొన్నారు.

తీరంలో తాటిచెట్ల పెంపకం



బుడగుట్లపాలెం తీరంలో తాటి చెట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లోని తీర ప్రాంతాల్లో తాటి చెట్ల పెంపకానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. బోంతలకోడూరు, బుడగుట్లపాలెం, బడివానిపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి పంచాయతీలను ఆనుకుని ఉన్న సముద్రతీరం కోతకు గురికాకుండా, గట్లు నిర్వీర్యం కాకుండా ఉండాలన్న లక్ష్యంతో తాటి చెట్లు పెంపకం చేయాలని గతంలో ప్రభుత్వం ప్రతిపాదించింది. తుఫాన్లు, ఇతర విపత్తులను సైతం తాటి చెట్లు తట్టుకుంటాయి.

పఠనంతోనే విజ్ఞానం



చదువు ఆవశ్యకతను వివరిస్తున్న లైబ్రేరియన్ ఉగ్రసేన

శ్రీకాకుళం అర్బన్: చదువుతోనే విజ్ఞానం లభిస్తుందని బలగ గ్రంథాలయ శాఖాధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం, చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగి టి.తిలక్ మాట్లాడుతూ గ్రంథాలయం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: పుస్తక పఠనంతో విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. రణస్థలం శాఖాగ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: లావేరు శాఖా గ్రంథాలయం వద్ద ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బాతువలో నవోదయ మోడల్ పరీక్ష

జి.సిగడాం: మండలంలోని బాతువ ప్రాథమిక పాఠశాలలో నవోదయ మోడల్ పరీక్ష ఆదివారం జరిగింది. ఉపాధ్యాయుడు మొయ్యి జనార్దనరావు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ముగిసిన బాబా మందిర వార్షికోత్సవం



బాబాకు అభిషేకం చేస్తున్న దృశ్యం

జి.సిగడాం : మండలంలోని చెట్టుపొదిలాంలో షిర్డీ సాయిబాబా మందిర ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఓంసాయి, శ్రీసాయి, జయజయ సాయి..నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గురువు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూపతి అర్జున్‌కుమార్, రమాదేవి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అరసవల్లి: శ్రీకాకుళం రూరల్ మండలం బైరి 33/11 కె.వి.విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డివిజనల్ ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సింగుపురం, మామిడివలస, కిష్టప్పపేట, తండేంవలస, పెద్దపాడు, పాత్రునివలస తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, ఆయా గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

లక్ష్మీగణపతికి చందనోత్సవం



అక్షయ తృతీయ సందర్భంగా నగరంలోని మొండేటివీధిలో లక్ష్మీగణపతి స్వామికి ఆదివారం చందనంతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామి



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగలో అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అర్చకుడు శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చక్కగా అలంకరించారు. అనంతరం గణపతి హోమం, సుదర్శన హోమం, పరివార దేవతల మూలమంత్రాలతో హవనం నిర్వహించారు. అక్షయ తృతీయ కావడంతో ఆలయంలో కొలువైన మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, పేర్ల రామకృష్ణారావు, దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మురపాక సొసైటీ కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ అధ్యక్షుడు, డైరక్టర్లు, సభ్యులు

లావేరు: మండలంలోని మురపాక కో–ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం మురపాక గ్రామంలో ఏకగ్రీవంగా జరిగాయి. సొసైటీ అధ్యక్షుడిగా బొడ్డ మల్లిబాబు, ఉపాధ్యక్షుడిగా వండాన రామినాయుడు, డైరెక్టర్లుగా వడ్డి ఈశ్వరరావు, ప్రగడ రమణమూర్తి, మాడుగుల ప్రభాకరరావు, దాశెట్టి షణ్ముఖరావు, పెయ్యల లక్ష్మణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, పీఎంసీ చైర్మన్ తేనేల విద్యాసాగర్, ఉప సర్పంచ్ వడ్డి సూర్యకుమార్, నాయకులు పెయ్యల లక్ష్మణరావు, వడ్డి అప్పయ్య, వార్డు మెంబర్లు వండాన శిమ్మినాయుడు, మజ్జి శ్రీను, యెన్నేటి ఈశ్వరరావు, ముల్లు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షలతో షెడ్డు నిర్మాణం



అంగీకార పత్రాన్ని అందిస్తున్న దాత కిరణ్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్రపుష్కరిణికి వెళ్లే మార్గంలో భారీ జింకు షెడ్డు నిర్మాణానికి వ్యాపారవేత్త, దాత నారాయణశెట్టి కిరణ్ ముందుకొచ్చారు. ఆదివారం ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి సూచనల మేరకు అధికార సిబ్బంది బి.ఎస్.చక్రవర్తికి, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలకు అంగీకార పత్రం సమర్పించారు. అంతకుముందు ఆదిత్యున్నిదర్శించుకున్నారు. షెడ్డు నిర్మాణానికి రూ.4.50 లక్షల వరకు అవసరమవుతాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని రవి తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సొండి కులస్తులకు గుర్తింపు



కోటేశ్వర చౌదరికి సన్మానిస్తున్న సంఘ నాయకులు

రణస్థలం: ప్రభుత్వం సొండి కులాన్ని గుర్తించి అరసవల్లి ఆదిత్యాలయ పాలకమండలి సభ్యులుగా పదవి ఇవ్వడం ఆనందంగా ఉందని పాలకమండలి సభ్యుడు నెలమపురి కోటేశ్వర చౌదరి అన్నారు. మండలంలోని పిన్నింటిపేట రోడ్డులో అపార్ట్‌మెంట్ ఆవరణలో రణస్థలం, లావేరు సొండికుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కోటేశ్వర చౌదరిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొండి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మొగలపురి కిషోర్ కుమార్, ఎం.ఎం.రావు, పరిడాల మహేశ్వరరావు, సుధాకర్, ప్రకాశ్, బాలరాజు, రమణబాబు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: కాలుష్య రహిత ప్రపంచాన్ని నిర్మించడంలో, పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత మెలగాలని రోటరీ క్లబ్ శ్రీకాకుళం సహాయ గవర్నర్ ఎంఆర్‌కే దాస్ అన్నారు. వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా నగరంలోని రోటరీ వనంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి బి.శ్రీనివాస, రీజనల్ సెక్రటరీ డి.శివశంకర్, ప్రతినిధులు నేతాడ వెంకటరావు, అన్నెపు అనంతరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాముని సన్నిధిలో చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్సై బలివాడ గణేష్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దబరాటం వీధి డీఎస్పీ కార్యాలయం దరిలో సీతారాముల ఆలయ ప్రాంగణం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలను దృష్టిలో ఉంచుకొని పాదచారులు, వాహనచోదకుల దాహార్తిని తీర్చటానికి ముందుకు వచ్చిన ఆలయ కమిటీని అభినందించారు. అనంతరం సామాజిక కార్యకర్త చిన్నారి ట్వింకిల్ చేతుల మీదుగా సుమారు 3000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు.

నీడకు నెలవు



తరువులు కల్ప తరువులు.. చల్లని నీడకు నెలవులు. గుజరాతీపేట కూడలి వద్ద మర్రిచెట్టు స్థానికులను సేదతీరుస్తోంది. ఎండ నుంచి వచ్చే బాటసారులకు ఉపశమనాన్ని అందిస్తోంది. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కనిపించే ఇటువంటి చెట్లు పట్టణంలోనూ ఉండటంతో స్థానికులు అపురూపంగా చూసుకుంటున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్